# కాశ్మీర్ అసెంబ్లీ తీర్మానాన్ని తిరస్కరించడం భావ్యమేనా?

కాశ్మీర్ విషయంలో మన పాలకులు ప్రదర్శిస్తున్న వింత వైఖరిని అర్థం చేసుకోవడం చాలా కష్టంగా ఉంది.

కాశ్మీర్ ఎప్పటికీ భారతదేశంలో భాగమేనంటారు.

కాశ్మీరీలు దీని గురించి ఏమనుకున్నా తమకు అక్కరలేదంటారు.

భారతదేశం ప్రజాస్వామ్యమేనంటారు.

కరపత్రం

**ఈ మూడు ఎట్లా సాధ్యమవుతాయి?**

భారతదేశం ప్రజాస్వామ్యంగానే వుండదలుచుకున్నట్టయితే, అదే సమయంలో కాశ్మీర్ శాశ్వతంగా భారత్‌లో భాగంగా వుండాలని కోరుకున్నట్టయితే కాశ్మీరీల మనోభావాలను గౌరవించి వారిని ఒప్పించమొక్కటే దానికి ఉండగల మార్గం.

భారతదేశం (కనీసం కాశ్మీర్‌కు సంబంధించినంతవరకు) సైనిక రాజ్యమైనట్టయితేనే కాశ్మీరీల భావాలు పట్టించుకోకుండా బలవంతంగా కాశ్మీర్‌ను భారత్‌లో భాగంగానే వుంచుకునే ప్రయత్నం చేయవచ్చు. ఆ ప్రయత్నంలో గెలుపు ఓటములు ఇరుపక్షాల పట్టుదలను బట్టి, శక్తియుక్తులను బట్టి వుంటాయి. 45 లక్షల జనాభాగల కాశ్మీర్‌లోయలో గడచిన పదేళ్లలో 50 వేల మంది చనిపోయినప్పటికీ కాశ్మీరీల పట్టుదల పెద్దగా సడలినట్టు కనిపించదు కాబట్టి భారతదేశానికి 'గెలుపు' అంత సులభం కాకపోవచ్చు.

అదెట్లాగున్నా, భారతదేశం ప్రజాస్వామ్యమేనని చెప్పుకునే అర్హత మాత్రం మనకుండదు. ఎందుకంటే పాలకులు ప్రజల అభిప్రాయాలను గౌరవించాలన్నది ప్రజాస్వామ్యాన్ని నిర్వచించే ప్రధాన లక్షణాలలో ఒకటి కాబట్టి.

ఇంకొక వైరుధ్యం చూడండి.

కాశ్మీర్ భారత్‌లో అవిభాజ్య భాగమేనని (హిందీలో 'అటూట్ అంగ్' అంటారు) ఒప్పుకుంటూ, 1953కు ముందు ఉండిన సమగ్రమైన స్వయంప్రతిపత్తిని మాత్రం తిరిగి కోరుకున్న కాశ్మీర్ అసెంబ్లీ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం ఒక్కమాటలో ఇచ్చేది లేదు అని కొట్టి పారేసింది.

కానీ కాశ్మీర్ భారత్‌లో భాగమే కాదనీ వేరయిపోతుందనీ ప్రకటించుకున్న

హురియత్ కాన్ఫరెన్స్‌తో మాత్రం కేంద్రప్రభుత్వం మాట్లాడుతుందంట.

**ఏం మాట్లాడుతుంది?**

హురియత్ ఛైర్మన్ మౌల్వీ ఉమర్ ఫరూఖ్ యోగక్షేమాల గురించా? ఎండల కాలంలో అద్వానీని గుల్మార్గ్‌కు రానివ్వడం గురించా? ముగల్ గార్డెన్స్‌లో సినిమా షూటింగ్‌లు జరుపుకోనివ్వడం గురించా?

ఏం మాట్లాడుతుంది?

అసంబద్ధమైన ఈ వైఖరులు ఎవరిని మెప్పించడానికి?

పాకిస్తాన్ సంగతి పక్కన పెట్టండి, ఒసామాబిన్ లాడెన్ సంగతీ, వారి జిహాద్ సంగతీ పక్కన పెట్టండి. టెర్రరిజం సంగతి పక్కన పెట్టండి. జవహర్‌లాల్ నెహ్రూకూ షేక్ అబ్దుల్లాకూ వున్న స్నేహం సంగతి పక్కన పెట్టండి. అంటే కాశ్మీర్ ప్రస్తావన రాగానే చర్చకు వచ్చే అన్ని విషయాలూ పక్కన పెట్టండి. కాశ్మీర్ గురించి ఏ కొంచెమైనా తెలిసిన వారందరికీ (వెంకయ్యనాయుడునూ సుదర్శన్‌జీనీ ఈ జాబితాలో చేర్చడం కష్టమనుకోండి) వీటి కంటే ముఖ్యమైన విషయమొకటి ఉందని తెలుసును.

అది తమ నేల, తమ గడ్డ, తమ సంస్కృతుల పట్ల ప్రగాఢమైన అభిమానం గల కాశ్మీరీల జాతీయతా భావం. ఆ ప్రత్యేకతను కాపాడుకోవాలనేది కాశ్మీరీల ప్రధాన రాజకీయ ఆకాంక్ష. కాశ్మీరీలను ప్రధానంగా కదిలించేది అదే. వేరెవ్వరికీ హాని కలిగించని ఈ ఆకాంక్షను గౌరవించకుండా వుండవలసిన అవసరం లేదు. కాగా, దానిని గౌరవించకుండా కాశ్మీర్‌ను భారతదేశంలో వుంచుకోవాలని మనమనుకున్నా, పాకిస్తాన్‌లో వుంచుకోవాలని పాకిస్తాన్ అనుకున్నా భయంకరమైన అణచివేత ద్వారా తప్ప అది సాధ్యం కాదు.

**అదే నాగరికమని మనం అనుకుంటున్నామా?**

మనం నాగరికతకు వేరే నిర్వచనం ఇవ్వబోతామని 1947లో కాశ్మీరీలు నమ్మారు. లౌకిక, ప్రజాతంత్ర, ఫెడరల్ భారతదేశంలో తమ ప్రత్యేకతకు గుర్తింపు, గౌరవం, రక్షణ వుంటుందనీ, సున్నీ మతవాద నియంతృత్వంగా వుండబోయే పాకిస్తాన్‌లో వుండదనీ అనుకున్నారు. 95 శాతం ముస్లింలయిన కాశ్మీరీలలో మెజారిటీ అభిప్రాయం ఆనాడు అదే.

**వాళ్లు మనకు అంత గౌరవం ఇచ్చారు. మనం వాళ్ల మనోభావాలకు ఎంత ఇచ్చాం?**

వాళ్లను యాభై ఏళ్లుగా అనుమానంగా చూస్తున్నాం. కాశ్మీర్ పాకిస్తాన్‌లో కాక భారతదేశంలో భాగం కావాలన్న నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా ఆమోదించిన ప్రజలకు ప్రజాస్వామ్యం ఏ కొంచెం ఇచ్చినా పాకిస్తాన్‌లో కలిసిపోతారని అనుమానించాం. కాశ్మీర్ ప్రస్తావన ఎప్పుడొచ్చినా కాశ్మీరీల గురించి కాక పాకిస్తాన్ గురించి మాట్లాడాం. అది అన్యాయమని మనమెవరమూ అనుకోలేదు. ఇప్పటికీ అనుకోవడం లేదు. కాశ్మీరీలు ఆనాడు పాకిస్తాన్‌లో కాక భారత్‌లో చేరాలని మెజారిటీగా భావించడం మన గొప్పతనమని నెహ్రూ వంటి లౌకికవాదులనుకోగా, కాశ్మీర్ తరతరాలుగా భారత్‌లో భాగమే కాబట్టి ఇప్పుడు వాళ్లు చేరేదేమిటి, చేరకపోయేదేమిటి అని సంఘ్ పరివార్ హిందుత్వ వాదులనుకున్నారు. వీళ్లకు దేశమంటే మట్టే తప్ప మనుషులు కాదు కాబట్టి ఇంతకంటే

భిన్నంగా వాళ్లు ఆలోచించలేరు.

నిజానికి ఇండియాలోగానీ పాకిస్తాన్‌లోగానీ కలిసి తీరాలన్న ఒత్తిడిని కాశ్మీరీలలో చాలామంది ఆనాడు ఆమోదించలేదు, ఈనాడూ ఆమోదించడం లేదు. ఎటొచ్చీ స్వతంత్ర కాశ్మీర్‌ను ఈ రెండు దేశాలూ బతకనియ్యవన్న భయం వల్ల రెండిట్లో ఒక దానిలో చేరక తప్పదన్న అభిప్రాయానికి వారిలో మెజారిటీ వచ్చారు. అందులో కొంతమంది పాకిస్తాన్ వైపు మొగ్గు చూపగా ఎక్కువమంది ఇండియాలో చేరడం మేలనుకున్నారు. దానికి కారణం తమ ప్రత్యేకతను కాపాడుకోవడానికి అవకాశం లౌకిక, ప్రజాతంత్ర, ఫెడరల్ భారతదేశంలోనే వుంటుందని వారు విశ్వసించడం. ఆ షరతు మీదనే కాశ్మీర్ ఇండియాలో భాగమయింది. లేకపోతే హరిసింగ్ ఒప్పుకున్నా మెజారిటీ కాశ్మీరీలు ఒప్పుకోక పోదురు. ఆ షరతే ఆర్టికల్ 370 రూపం తీసుకుంది. 1953లో షేక్ అబ్దుల్లాను ఏ కారణం లేకుండా జైలులో పెట్టేదాకా అది అమలయ్యింది.

ఆ తరువాత క్రమంగా కాశ్మీరీ స్వయం ప్రతిపత్తిని కొద్ది కొద్దిగా మన పాలకులు తొలగించారు. 1954లో మొదలైన ఈ ప్రక్రియ 1975లో ఇందిరాగాంధీ షేక్ అబ్దుల్లా మీద ఒత్తిడి పెట్టి కాశ్మీర్ భారతదేశంలో శాశ్వతంగా భాగమేనని ఒప్పందం చేయించడంతో ముగింపు కొచ్చింది. కానీ దాని వలన కాశ్మీరీలో నెలకొన్న వైమనస్యభావం ఆ తరువాతే పెరిగి ద్వేషంగా మారింది.

తిరిగి మళ్లీ 1953 నాటి స్థితికి వెళ్లాలన్న కాశ్మీర్ ప్రజాప్రతినిధుల ఆకాంక్ష ఈ అన్యాయాన్ని చెరిపివేయాలన్న కోరికే తప్ప వేరే ఏమీ కాదు. ఈ చరిత్ర గురించి ఏ మాత్రం అవగాహన లేకుండా ఆ తీర్మానాన్ని ఒప్పుకునేది లేదు అని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం, ఫరూఖ్ అబ్దుల్లాను బర్తరఫ్ చేసి అరెస్టు చేయాలని ఆర్.ఎస్.ఎస్. నాయకులు మాట్లాడడం క్షమించరాని తెలివితక్కువతనం. తుపాకులతో కాశ్మీర్‌ను నిలుపుకోవడం సాధ్యమవుతుందన్న మూర్ఖపు ఆలోచన దీనికి మూలం. కానీ కాశ్మీరీలను భారతదేశంలోనే వుండమని ఒప్పించడానికి ఏ మాత్రం అవకాశమైనా వుందంటే అది 1953 స్థితిని పునరుద్ధరించడంలోనే వుంది. ఆచంద్రతారార్కం కాశ్మీర్ భారత్‌లో భాగమేనని పదే పదే నినాదాలు ఇచ్చేవాళ్లకు ఈ విషయం అర్థం కావడం లేదంటే కారణం, వాళ్లు భారతదేశం అని పిలుచుకునేది భూభాగాన్నే తప్ప మనుషుల్ని కాదు.

మన మందరమూ అట్లాగే ఎందుకు ఆలోచించాలి?

14.07.2000